నేడు మల్లన్న స్వామి కల్యాణోత్సవం

మణికొండ: ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే మల్లన్న స్వామి కల్యాణోత్సవానికి మణికొండ గ్రామం సిద్ధమైంది. ల్యాంకోహిల్స్‌ సమీపంలో ఉన్న మల్లన్న, బీరప్ప, రేణుక ఎల్లమ్మ దేవాలయాలను ఉత్సవాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టెంట్‌లు, ఫ్యాన్‌లు, కూలర్‌లను ఏర్పాటు చేశారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు గంపలు ఎత్తుకుని భక్తులు దేవాలయానికి చేరుకుంటారు. అనంతరం మల్లన్నకు కొట్నం పెట్టడం , 11.15 గంటలకు మల్లన్న కల్యాణం, మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు వివరించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు అగ్నిగుండాలు తొక్కటం, 3 గంటలకు సదర్‌పటం, సాయంత్రం 5 గంటలకు ఎల్లమ్మ బోనాలు, రాత్రి 9 గంటల నుంచి మల్లన్న చరిత్ర ఒగ్గు కథ ఉంటుందని దేవాలయ కమిటీ నాయకులు వివరించారు. సోమవారం మధ్యాహ్నం ఒడి బియ్యం అన్నదాన కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. ఉత్సవాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కును అందజేస్తున్న యాలాల నరేష్‌

మణికొండ: పేద ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందని వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మణికొండ మాజీ సర్పంచ్‌ యాలాల నరేష్‌ అన్నారు. శనివారం ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెమలినగర్‌కు చెందిన బ్రహ్మయ్యచారికి ప్రభుత్వం నుంచి వచ్చి ముఖ్యమంత్రి సహాయనిధి రూ. 34 వేల చెక్కును మాజీ కౌన్సిలర్‌లు కె.లక్ష్మీనారాయణ, డి.పురుషోత్తం , మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ కుమార్‌లతో కలిసి అందజేశారు. నాయకులు బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత

సీబీఐటీ ప్రిన్సిపాల్‌ నరసింహులు



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మణికొండ: భావితరాలకు నీటిని అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, నీటిని సంరక్షించేందుకు ప్రతిన బూనాలని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్‌ సీవీ నరసింహులు అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కళాశాలలో చైతన్య పరివృత ది ఎన్విరాన్‌మెంట్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, స్థిరమైన వినియోగ పద్ధతుల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ నీటి వినియోగం పరిమితంగా ఉండాలని, అవసరమైన మేరకే నీటిని ఉపయోగించాలని, వర్షం నీటిని భూమిలోకి సాధ్యమైనంత ఎక్కువ మోతాదులో ఇంకించే ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్‌ ఇంజనీరింగ్‌ హెచ్‌ఓడీ డాక్టర్‌ కె. జగన్నాథరావు, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌ మహేశ్వర్‌రెడ్డిలతో పాటు క్లబ్‌ విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు



రాయదుర్గం: హైటెక్‌సిటీ పరిధిలో పలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఫుడ్‌ సేఫ్టీ అధికారుల తనిఖీలు కొనసాగుతున్నాయి. శనివారం గచ్చిబౌలి డీఎల్‌ఎఫ్‌ రోడ్డులోని వరలక్ష్మీ టిఫిన్‌ సెంటర్‌ను అధికారులు పరిశీలించారు. నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. కిచెన్‌లో యథేచ్ఛగా ఎలుకలు సంచరించడం, డ్రైనేజీలో ఆహార వ్యర్థాలను వేయడంతో మురుగునీరు పొంగి దుర్వాసన వెదజల్లుతోందని అధికారులు తెలిపారు. అనంతరం మాదాపూర్‌లోని క్షత్రియ ఫుడ్‌ రెస్టారెంట్‌లో సింథటిక్‌ రంగులు వాడుతున్నట్లు గుర్తించారు. కిచెన్‌లో రిఫ్రిజిరేటర్‌ అధ్వానంగా ఉండడంతో బాటు చికెన్‌, మటన్‌ నిల్వ ఉన్నట్టు అధికారులు గుర్తించారు.

పది పరీక్షలను పటిష్టంగా నిర్వహించాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ నారాయణరెడ్డి
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్‌



శంషాబాద్‌లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ నారాయణరెడ్డి

శంషాబాద్‌: పదో తరగతి పరీక్షలను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పటిష్టంగా నిర్వహించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్‌ బాలుర, బాలిక ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న పదో తరగతి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. ప్రశ్న పత్రాల రికార్డులతో పాటు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో సరైన గాలి, వెలుతురు, విద్యుత్‌ సరఫరా సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల తీవ్రత కారణంగా వైద్య శిబిరాల వద్ద ఓఆర్‌ఎస్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా ఎలాంటి ఎలక్ట్రానిక్‌ వస్తువులు పరీక్ష కేంద్రాల్లో తీసకురాకుండా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్‌ ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా పరీక్షల నిర్వహణ తీరు సక్రమంగా ఉండాలన్నారు.

19 మంది విద్యార్థుల గైర్హాజర్‌...

రాజేంద్రనగర్‌: రాజేంద్రనగర్‌ మండల పరిధిలో శనివారం నిర్వహించిన పదో తరగతి హిందీ పరీక్షకు 19 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈవో తెలిపారు. మండల పరిధిలో మొత్తం 22 సెంటర్లలో 5,400 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు తెలిపారు. శనివారం హిందీ పరీక్షకు 4,985 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారన్నారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను కల్పించినట్లు తెలిపారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు సాఫీగా సాగుతున్నాయన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. ఇన్విజిలేటర్ల బృందంతో పాటు స్క్వాడ్‌ బృందాలు పరీక్ష కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.

టెన్త్‌ పరీక్ష కేంద్రాల తనిఖీ



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరుగుతున్నాయని బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర పేర్కొన్నారు. కార్పొరేషన్‌ పరిధిలోని జిల్లా పరిషత్‌ హై స్కూల్‌, భవానీ మోడల్‌ స్కూల్‌, గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌, ఎస్‌ఎంపీ మోడల్‌ స్కూల్‌, ఎల్‌ఎస్‌ఆర్‌ కాన్సెప్ట్‌ స్కూల్‌లలోని పరీక్ష కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టెన్త్‌ పరీక్షలు నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు చేపట్టారన్నారు.

ఇంటి నిర్మాణాల అనుమతికి కొత్త సాఫ్ట్‌వేర్‌

రాజేంద్రనగర్‌ సర్కిల్‌ డీసీ రవికుమార్‌



అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీ రవికుమార్‌

రాజేంద్రనగర్‌: జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలో ఇంటి నిర్మాణ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బీయూఐఎల్‌డీఎస్‌ ఓడబ్ల్యూ సాఫ్ట్‌వేర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సర్కిల్‌ ఉప కమిషనర్‌ డాక్టర్‌ రవికుమార్‌, టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ శ్రీధర్‌లు సూచించారు. కొత్త సాఫ్ట్‌వేర్‌పై సర్కిల్‌ కార్యాలయంలో సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్‌ రవికుమార్‌ మాట్లాడుతూ... ప్రజలకు అనుమతులను మరింత సులభతరం చేసేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకొచ్చిందన్నారు. ఈ సాఫ్ట్‌వేర్‌ ద్వారా ప్రజలకు మరింత త్వరగా ఇంటి అనుమతులు లభిస్తాయన్నారు. ప్రజలు ఈ సాఫ్ట్‌వేర్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టౌన్‌ ప్లానింగ్‌ ఏసీపీ శ్రీధర్‌ మాట్లాడుతూ... శనివారం నుంచి సిబ్బందికి సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి రోజు టౌన్‌ ప్లానింగ్‌ సెక్షన్‌లో పని చేస్తున్న సిబ్బందికి అవగాహన కల్పించామన్నారు. ప్రజలు తమ ఇంటి నిర్మాణ అనుమతుల కోసం గతంలో టీజీబీపీఏఎస్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకునేవారన్నారు. ప్రస్తుతం కొత్త సాఫ్ట్‌వేర్‌ బిల్ట్‌నౌలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ నుంచి ఈ సాఫ్ట్‌వేర్‌ పూర్తి స్థాయిలో పని చేస్తుందన్నారు. ప్రస్తుతం టీజీబీపీఏఎస్‌ఎస్‌లో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులను పరిశీలించి అనుమతులను సత్వరమే మంజూరు చేస్తున్నామన్నారు. శనివారం నుంచి కొత్త సాఫ్ట్‌వేర్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు.

ఆరె కటికెల పట్ల బీజేపీ వైఖరి బాధాకరం

రాజేంద్రనగర్‌: భారతీయ జనతా పార్టీ ఆరె కటికె కులస్తుల పట్ల వ్యవహరించిన తీరు బాధకరంగా ఉందని తెలంగాణ ఆరె కటికె విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జి.వెంకటేష్‌, ప్రధాన కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్‌ ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ... ఆరె కటికెలకు బీజేపీ తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆరోపించారు. తమ కులానికి చెందిన జమాల్‌పూర్‌ చంద్రశేఖర్‌ 30 సంవత్సరాలుగా పార్టీకి సేవ చేస్తున్నారని గుర్తు చేశారు. భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడిగా రేసులో ఉండి ఒకే ఒక్కడు అధ్యక్ష పదవీ కోసం నామినేషన్‌ వేశారని తెలిపారు. ఏకగ్రీవంగా ఎంపిక కావాల్సిన చంద్రశేఖర్‌ను కేవలం కటికె కులస్తుడు కావడంతో పక్కకు తప్పించడం తమకు ఆందోళన కలిగించిందన్నారు. యాదవ కులస్తులు సైతం బీసీలని... తాము కూడా బీసీల కిందికే వస్తామన్నారు. భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్ష పదవిని తమ కులస్తునికి ఇచ్చినట్లే ఇచ్చి మరొకరికి ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో తమ కులస్తులకు ఎక్కడా ప్రాతినిధ్యం లేదన్నారు. యాదవ కులస్తులకు పార్టీలో వివిధ హోదాల్లో ప్రాతినిధ్యం ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో బీజేపీ ఆరె కటికె కులస్తులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని వేదిక ద్వారా కేంద్ర, రాష్ట్ర కమిటీలను కోరుతున్నామని వారు వెల్లడించారు.

ట్రాఫిక్‌ ఇబ్బందుల నివారణకు పటిష్ట చర్యలు

సాక్షి ఎఫెక్ట్‌..



హైదర్‌గూడ చౌరస్తాలో ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌

అత్తాపూర్‌: ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు నగరంలో వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్న ఉద్యోగుల రవాణాలో ఎలాంటి అవరోధాలు లేకుండా చూసుకోవడమే తమ లక్ష్యం అని రాజేంద్రనగర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.రాజేందర్‌గౌడ్‌ అన్నారు. 'వామ్మో.. హైదర్‌గూడ చౌరస్తా..! అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో శనివారం ప్రచురితమైన కథనానికి ఇన్‌స్పెక్టర్‌ రాజేందర్‌గౌడ్‌ స్పందించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి శనివారం ఉదయం హైదర్‌గూడ, అత్తాపూర్‌ ప్రాంతాలలో పర్యటించారు. నగరంలో నగర శివారులో వివిధ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులను చేరవేసేందుకు అత్తాపూర్‌, హైదర్‌గూడ పాయింట్లను కేంద్రంగా చేసుకొని బస్సు సర్వీసులను నడుపుతుంటారు. సాఫ్ట్‌వేర్‌, హార్ట్‌వేర్‌ ఉద్యోగుల కోసం కూడా ఆయా కంపెనీలకు ఈ ప్రాంతం నుంచి పలు రకాల వాహనాలలో తీసుకెళ్తారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల ప్రాంతంలో విద్యార్థులు, ఉద్యోగులు హడావిడి ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. ఈ హడావిడిలో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా క్రమ పద్ధతిలో బస్సులు వెళ్లేలా సిబ్బందిని నియమించామని ట్రాఫిక్‌ ఇన్స్‌పెక్టర్‌ వివరించారు. ట్రాఫిక్‌ నిబంధలను వాహనదారులు, డ్రైవర్లు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలకు తావు ఉండదని ఆయన స్పష్టం చేశారు. వేగం కన్నా గమ్యస్థానాలకు చేరడమే ప్రాధాన్యతగా భావించాలని ఇన్‌స్పెక్టర్‌ సూచించారు.

బీజేపీదే భవిష్యత్‌

రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి



బీజేపీ రూరల్‌ జిల్లా అధ్యక్షుడు పతంగి రాజుభూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: భారతీయ జనతా పార్టీ రోజురోజుకూ బలమైన శక్తిగా ఎదుగుతోందని ఆ పార్టీ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ కార్పొరేటర్‌ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నూతనంగా రంగారెడ్డి రూరల్‌ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన పతంగి రాజుభూపాల్‌ను శనివారం కలిసి సన్మానించారు. మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందేలా శ్రీరాములు, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని విధాలుగా పార్టీని విజయ పథంలో తీసుకెళ్లాలని చర్చించుకున్నామన్నారు. డివిజన్‌ అధ్యక్షుడు అడికే జనార్దన్‌, సీనియర్‌ నాయకులు రావుల భాస్కర్‌, నవారు మురళీధర్‌, బబ్లు, మన్మోహన్‌రెడ్డి, పోప్పట్‌ శంకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మహవీర్‌ కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి, అధ్యాపకులు

మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు మంచి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తు అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తున్నామని మహవీర్‌ గ్రూప్‌ కళాశాలల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మహవీర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ కళాశాల 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిల్వర్‌ జూబ్లీ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... స్వర్గీయ సంరెడ్డి సుదర్శన్‌రెడ్డి కళాశాల ఏర్పాటు చేసి నామమాత్రపు ఫీజులతో ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. తెలంగాణలో ఇంజినీరింగ్‌ విభాగంలో ఏడు బ్రాంచీలతో విద్యార్థులకు నైపుణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో పాల్గొని విజేతలుగా నిలుస్తున్నారన్నారు. కళాశాల జాయింట్‌ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయ్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు నైపుణ్యం, నైతిక విలువలు పాటించడం ద్వారా జీవన లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్య, క్రీడల్లో రాణిస్తున్న విద్యార్థులతో పాటు ఉత్తమ బోధన అందజేస్తున్న అధ్యాపకులను సన్మానించి మెమెంటోలను అందజేశారు. కళాశాల చైర్మన్‌ ఎస్‌.జయలక్ష్మి, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వి.ఉషశ్రీ, డాక్టర్‌ సుధాకర్‌రెడ్డి, డాక్టర్‌ కె.కిరణ్‌కుమార్‌, డాక్టర్‌ శ్రీకాంత్‌రెడ్డి, సి.హెచ్‌.సుధాకర్‌, డాక్టర్‌ నాగేశ్వర్‌రావు, స్వప్న, కళ్యాణి, డాక్టర్‌ మల్లారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ భూముల పరిరక్షణకు 'పోస్టు కార్డు' ఉద్యమం

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ భూముల పరిరక్షణకు అఖిల భారత విద్యార్థి పరిషత్‌ హెచ్‌సీయూ శాఖ ఆధ్వర్యంలో 'పోస్టు కార్డు' ఉద్యమం చేపట్టింది. శుక్రవారం రాత్రి హెచ్‌సీయూలో 'సేవ్‌ హెచ్‌సీయూ ల్యాండ్స్‌' పేరిట పోస్టు కార్డుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివేకానంద స్టూడెంట్స్‌ అమెనిటీస్‌ సెంటర్‌ వద్ద ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్‌లు మాట్లాడుతూ హెచ్‌సీయూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధిస్తూ నగరపేరును యావత్‌ ప్రపంచానికి చాటి చెబుతోందని, ఇంతటి ప్రాధాన్యత కలిగిన హెచ్‌సీయూ క్యాంపస్‌ భూమిని ప్రభుత్వం విక్రయించాలని నిర్ణయించడం తగదన్నారు.

పీపీకి అభినందన



ఉప్పర్‌పల్లి కోర్టు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ వెంకటేశ్వర్‌ రెడ్డికి సైబరాబాద్‌ కమిషనర్‌ మహంతి ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు. విధి నిర్వహణలో ఆయన చూపిన చొరవ.. సేవలను ఈ సందర్భంగా సీపీ కొనియాడారు. – రాజేంద్రనగర్‌

బండ్లగూడ అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్‌ శరత్‌చంద్ర

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కిస్మత్‌పూర్‌లోని కార్యాలయంలోని కౌన్సిల్‌ హాల్‌లో శనివారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కమిషనర్‌ శరత్‌చంద్ర అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. తాగునీటి వనరులు, వార్డుల వారీగా కార్యాచరణ ప్రణాళిక, వివిధ వార్డులలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, ట్రేడ్‌ లైసెన్స్‌ల జారీ, ఎల్‌ఆర్‌ఎస్‌ సర్వే అడ్వర్టైస్మెంట్‌ పన్నుల వసూలుపై చర్చించారు. ప్రాపర్టీ టాక్స్‌ విధింపు, ఇంజినీరింగ్‌ విభాగంలో వివిధ వార్డులలో అభివృద్ధి పనుల పురోగతి, నూతన పనులు చేపట్టేందుకు, వన మహోత్సవంలో టార్గెట్‌ ప్రకారం మొక్కలు పెంచడం, నాటిన మొక్కల సంరక్షణ, నర్సరీ నిర్వహణ, రానున్న సంవత్సరంలో టార్గెట్స్‌ ప్రకారం నర్సరీల పెంపుపై చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వివిధ వార్డులలో వీధిదీపాల నిర్వహణ, నూతన లైట్లు ఏర్పాటు.. మరమ్మతులు, భవన నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు విడుదల, అక్రమ నిర్మాణాలపై చర్యలు, కోర్టు కేసులు, నూతన బడ్జెట్‌ ప్రతిపాదనలు, బ్యాలెన్స్‌ చెల్లింపులు, ఆడిట్‌ అభ్యంతరాలు ఇతరత్రా విషయాలపై పలువురు చర్చించారు. బ్యాంక్‌ లింకేజీ ఇందిరా మహిళా శక్తి స్కీమ్‌, వివిధ టార్గెట్స్‌, నూతన సంఘాల ఏర్పాటు, స్వచ్ఛ సర్వేక్షణ్‌–2025, సిటిజన్‌ ఫీడ్‌ బ్యాక్‌పై సమీక్షించారు. సమావేశంలో వివిధ సెక్షన్‌ల అధికారులు, సెక్షన్‌ అసిస్టెంట్లు, డీఈఈవోలు, ఆర్‌పీలు, శానిటేషన్‌ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

మదిదోచే చేనేత ప్రదర్శన



కొండపల్లి బొమ్మలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

మణికొండ: మణికొండ పైప్‌లైన్‌ రోడ్డులోని సుందర్‌ గార్డన్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. దేశ వ్యాప్తంగా చేతి వృత్తుల వారు తయారు చేసిన దుస్తులు, గృహోపకరణ వస్తువుల ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచారు. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్‌, డిజైనర్‌, కాంతా వర్క్‌, హ్యాండ్‌ బ్లాక్‌ ప్రింటెడ్‌ లెనిన్‌, కలంకారి, బెంగాల్‌ కాటన్‌ చీరలు అందుబాటులో ఉన్నాయి. అలాగే డ్రెస్‌ మెటీరియల్‌, డిజైనర్‌ బ్లౌజులు, ఖాదీ మెటీరియల్‌, వన్‌ గ్రాం గోల్డ్‌ జ్యువెలరీ, జైపూర్‌ బెడ్‌ షీట్లు, కొండపల్లి బొమ్మలు, పర్సులు, గృహోపకరణ వస్తువులను విక్రయిస్తున్నారు. పలు రాష్ట్రాలలో చేతి వృత్తి కళాకారులు తయారు చేసిన వస్తువులన్నీ ఒకే చోట మంచి నాణ్యతతో లభిస్తుండటంతో కొనుగోలుదారులు ఆదరిస్తున్నారని నిర్వాహకుడు అక్బర్‌ తెలిపారు. ఉగాది, రంజాన్‌ పండగల నేపథ్యంలో కొనుగోలుదారుల నుంచి మంచి ఆదరణ ఉందన్నారు. కొన్ని రోజులు మాత్రమే ఎగ్జిబిషన్‌ అందుబాటులో ఉంటుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కక్షపూరితంగానే సీఐటీయూ నేతల అరెస్టు




ఉడెంగడ్డ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్‌ పాలకులు కక్షపూరితంగానే సీఐటీయూ నాయకులపై కేసులు పెడుతూ వారిని అరెస్టులు చేస్తున్నారని సీఐటీయూ రాజేంద్రనగర్‌ మండల కార్యదర్శి వెంకటయ్య పేర్కొన్నారు. సీఐటీయూ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం ఉడెంగడ్డ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్‌ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. అనేక రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాల సవరణ, ఇన్సూరెన్స్‌లు అందించాలన్నారు. గతంలో ఇచ్చిన వినతి పత్రాలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అంగీకరించి అన్ని వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నదని ఆరోపించారు. కార్మికుల పక్షాన ముందుండి పోరాడుతున్న సీఐటీయూపై కక్షసాధింపుతో రాష్ట్రంలోని నాయకులపై కేసులు పెట్టించి అరెస్టులు చేయిస్తున్నారన్నారు. అక్రమ కేసులు, అరెస్టులను మానుకోవాలని ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో మరింత పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు జి.బాలరాజ్‌గౌడ్‌, నర్సింహ, అన్వర్‌, రిజ్వాన్‌, తిరుపతయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

గోల్కొండ: శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని గోల్కొండ డివిజన్‌ ఏసీపీ సయ్యద్‌ ఫయాజ్‌ కోరారు. గోల్కొండ సౌత్‌ వెస్ట్‌ ఫ్రెండ్స్‌ కమిటీ సభ్యులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్నివర్గాల వారు తమ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్‌ బి.సైదులు, జంగయ్య, ఇమ్రాన్‌ ఆలీఖాన్‌, ఇమ్రాన్‌, షేబాజ్‌ తదితరులు ఉన్నారు.

పెండింగ్‌ సమస్యలను పరిష్కరించండి



మున్సిపల్‌ కమిషనర్‌తో సమావేశమైన ఫెడరేషన్‌ నాయకులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ప్రస్తుత అధికారుల పాలనలోనైనా పరిష్కరించాలని మణికొండ మున్సిపాలిటీ ఆల్‌ కాలనీస్‌ రెసిడెంట్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆఫ్‌ ఫెడరేషన్‌ నాయకులు మున్సిపల్‌ కమిషనర్‌ డి.ప్రదీప్‌కుమార్‌ను కోరారు. శనివారం ఫెడరేషన్‌ అధ్యక్షుడు వంశీ, ప్రధాన కార్యదర్శి వి.ఆంజనేయులు, కోశాధికారి రవీందర్‌ రెడ్డిల ఆధ్వర్యంలో కార్యవర్గ కమిటీ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల భారీగా పెంచిన ఆస్తి పన్నును మరోసారి పరిశీలించి ప్రజలపై పన్ను భారాన్ని తగ్గించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పలు లింక్‌ రోడ్లు, కాలనీల రోడ్ల పనులు చేయాల్సి ఉందన్నారు. దోమల సమస్య విపరీతంగా పెరిగిపోయిందని, వాటిని నివారించేందుకు ప్రతి రోజూ ఫాగింగ్‌ చేయించాలన్నారు. రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి అనేక చోట్ల షాపులు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ సమస్యకు కారణం అవుతున్నారని వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మర్రిచెట్టు, అలకాపూర్‌ టౌన్‌షిప్‌ రోడ్డు నెంబర్‌ 13 జంక్షన్‌, సెక్రటేరియట్‌ కాలనీ ప్రవేశాలలో ట్రాఫిక్‌ సిగ్నల్‌లను ఏర్పాటు చేయాలన్నారు. సాయిరాం కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కరించక పోవటంతో ప్రధాన రోడ్డుపై మురుగు పారుతుందన్నారు. మరిన్ని పార్కులను అభివృద్ధి చేయాల్సి ఉందని, వాటి పనులను మొదలు పెట్టాలన్నారు. ఉపయోగంలో ఉన్న పార్కులలో మూత్రశాలల నిర్మాణం చేపట్టాలని కోరారు. అలకాపూర్‌ టౌన్‌షిప్‌లో కమ్యూనిటీ హాల్‌ నిర్మాణం చేపట్టాలని కోరారు. సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని కమిషనర్‌ హామీ ఇచ్చారు.

డ్రైవర్‌ను బెదిరించి ఆటో తీసుకెళ్లిన ముగ్గురి అరెస్టు

- ర్యాపిడోలో బుక్‌ చేసుకుని...
- మార్గ మధ్యలో ఆటోతో పరార్‌



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

శంషాబాద్‌ రూరల్‌: ర్యాపిడో ఆటోను బుక్‌ చేసుకున్న ముగ్గురు వ్యక్తులు.. హైదరాబాద్‌ నుంచి మండల శివారు ప్రాంతానికి వచ్చిన తర్వాత.. డ్రైవర్‌ను బెదిరించి ఆటోను దొంగిలించిన ఘటనలో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్‌ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... ఉప్పల్‌లోని మేడిపల్లి ప్రాంతానికి చెందిన బ్రహ్మయాదవ్‌ ర్యాపిడో ద్వారా ఆటో నడుపుతూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ నెల 13న ముగ్గురు వ్యక్తులు ఇతని ర్యాపిడో రైడ్‌లో బుక్‌ చేసుకున్నారు. ఉప్పల్‌ నుంచి మండలంలోని రాయన్నగూడ వద్దకు రాగా.. రాత్రి 10 గంటల సమయంలో బహిర్భూమి కోసం ఆటోను ఆపారు. తర్వాత డ్రైవర్‌ బ్రహ్మయాదవ్‌ను బెదిరించి ఆటోతో పరారయ్యారు.

జైలుకు వెళ్లివచ్చినా మారని బుద్ధి...

హైదరాబాద్‌లోని బండ్లగూడ ప్రాంతంలోని మహమ్మద్‌నగర్‌ వాసి మహ్మద్‌ రషీద్‌(26) ఆటో డ్రైవర్‌గా, బాలాపూర్‌ పరిధిలోని షాహీన్‌నగర్‌కు చెందిన షేక్‌ హసనుద్దీన్‌(22) డెకరేషన్‌ పని, మహ్మద్‌ ఆరీఫ్‌(25) ప్లంబర్‌గా పని చేస్తున్నారు. వీరు ర్యాపిడో రైడ్‌లో ఆటోను బుక్‌ చేసుకున్నారు. మార్గ మధ్యలో డ్రైవర్‌ను బెదిరించి ఆటోను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. వీరు గతంలో దొంగతనం, చైన్‌ స్నాచింగ్‌ కేసుల్లో జైలుకి వెళ్లారు. అయినా వారి ప్రవర్తన మార్చుకోలేదు. వీరి నుంచి పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపర్చారు.